క్లుప్తంగా

శక్తియాప్‌పై అవగాహన అవసరం



శక్తియాప్‌పై అంగన్‌వాడీ టీచర్లకు వివరిస్తున్న ఎస్సై కిషోర్‌బాబు

పామూరు: మహిళలు తమ సెల్‌ఫోన్లలో శక్తియాప్‌ను కలిగి ఉండాలని ఎస్సై టి.కిషోర్‌బాబు, ఎంపీడీఓ ఎల్‌.బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని కొత్తపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్‌.నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో శక్తియాప్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఎస్సై టి.కిషోర్‌బాబు మాట్లాడుతూ మహిళలు ఆపదసమయాల్లో ఉన్నప్పుడు రక్షించడానికి శక్తియాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు దాడుల నుండి రక్షించుకునేందుకు ఈయాప్ దోహదపడుతుందని, ప్రతి ఒక్కరు యాప్‌ను ఉపయోగించుకునేలా అవగాహన కలిగి ఉండాలన్నారు. అసిస్టెంట్ సీడీపీఓ పి.లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్య పదార్థాలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: గ్రేడింగ్ చేసే సమయంలో పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూసి బేళ్లు కట్టాలని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ రైతులకు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలం సందర్భంగా రైతులకు సూచనలు సలహాలు చేశారు. అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 469 బేళ్లను వేలానికి తీసుకురాగా 399 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 70 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.250, సరాసరి రూ.270.40గా నమోదైంది. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

31న పోటీ పరీక్షలపై అవగాహన

సింగరాయకొండ: మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 31వ తేదీ సోమవారం ఆర్‌ఆర్‌బీ, గ్రూప్‌–డీ పోటీ పరీక్షలపై ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులైన ఉలిచి కోటేశ్వరరావు, ఉలిచి రామారావు సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అవగాహన సదస్సులో పాల్గొనేవారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ముందుగా నమోదు చేసుకునే 75 మందికి స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు.

జాళ్లపాలెం తిరునాళ్లకు వేళాయే..!

- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరు కానున్న భక్తులు
- తిరునాళ్లకు సిద్ధమైన చిన్నమఠం
- భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు
- ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ



వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్



కొత్తపల్లి వీరబ్రహ్మయ్య స్వామి వారి మఠం ప్రాంగణం

కొండపి: ఏటా ఉగాది పర్వదినాన ఆనవాయితీగా నిర్వహించే వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లకు జాళ్లపాలెంలోని చిన్న మఠాన్ని వైభవంగా అలంకరించారు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన తిరునాళ్లలో జాళ్లపాలెం తిరునాళ్ల ఒకటి. ఈ తిరునాళ్లకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

ఇది తిరునాళ్ల చరిత్ర

జాళ్లపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి చంద్రయ్య, బూరెమ్మలకు 1848లో బ్రహ్మయ్య జన్మించాడు. బ్రహ్మయ్య చిన్నతనం నుంచి బ్రహ్మంగారి భక్తుడు. తాత్విక చింతనతో కాలం గడిపి భగవారాధనతో జీవించి జాళ్లపాలెంలో 1915లో ఉగాది పర్వదినాన సజీవ సమాధి అయ్యారు. అప్పటి నుంచి జాళ్లపాలెం గ్రామంలోని మఠంలో తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. ఉగాది రోజు భక్తులు భారీగా తరలివచ్చి తలనీలాలు సమర్పిస్తారు. భక్తులు తమకు పెట్టిన బిడ్డలకు బ్రహ్మయ్య అని నామకరణం చేసుకోవడంతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఇలా 131 ఏళ్లుగా ఈ తిరునాళ్ల నిర్వహిస్తున్నారు.

పశువుల పురోభివృద్ధికి ప్రదక్షిణాలు

పశువులు మేకలు, గొర్రెలను నీటితో శుభ్రపరచుకొని గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేయడం ఆ ప్రాంత ప్రజల పశుపోషకులకు అలవాటు. ఇలా చేయడం ద్వారా తమ పశుసంత పురోభివృద్ధి చెందుతాయని ఇక్కడ వారి నమ్మకం. తిరునాళ్లకు మూడు రోజుల ముందు నుంచి పశుసంతని గుడి చుట్టూ తిప్పటం ఆనవాయితీగా వస్తోంది. తిరునాళ్లను పురస్కరించుకొని స్వామికి భక్తులు విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు.

డ్రోన్ కెమెరాలతో పోలీస్ బందోబస్తు

తిరునాళ్ల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొండపి సీఐ సోమశేఖర్, కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. వాహన రాకపోకలను క్రమబద్ధీకరించడంతోపాటు ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా 200మంది సిబ్బంది తో, 3 డ్రోన్‌కెమెరాలతో పర్యవేక్షణ చేస్తూ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానంతో పాటు మజ్జి, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

ప్రత్యేకంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

తిరుణాళ్లకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని కందుకూరు, ఒంగోలు,పొదిలి డిపోల నుంచి ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక సర్వీసులను నిర్వహిస్తుంది. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఒంగోలు నుంచి సంతనూతలపాడు మీదుగా ఒంగోలు నుంచి టంగుటూరు మీదుగా,కందుకూరు నుంచి విక్కిరాలపేట మీదుగా, కందుకూరు నుంచి టంగుటూరు మీదుగా, పొదిలి, కనిగిరి నుంచి బస్సులను జాళ్లపాలెంకు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జడ్జి భరత్‌చంద్ర

కనిగిరిరూరల్: చిన్నారులను లైంగిక వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి కె.భరత్ చంద్ర అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పునుగోడులో శనివారం లైగింక వేధింపుల నిరోధక చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలపై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం దోహదపడుతుందని తెలిపారు. పిల్లలు సమాజంలో తమ చుట్టూ ఉన్న మానవ మృగాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులలో పోలీస్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, మహిళా హెల్ప్‌లైన్ 181, సమీకృత నెంబర్ 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, పారాలీగల్ వలంటీర్లు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరక్టర్ రమేష్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలి



కంబాలదిన్నె సచివాలయాన్ని తనిఖీచేస్తున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

పామూరు: సచివాలయ పరిధిలో నిర్వహించే సర్వేలను సిబ్బంది త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎల్‌.బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని కంబాలదిన్నె సచివాలయాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీచేశారు. రిజిస్టర్లు, ఆన్‌లైన్‌లో ఉన్న రికార్డులు, పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి కారణాలపై సిబ్బందితో చర్చించారు. సచివాలయ పరిధిలో నూరుశాతం ఇంటిపన్ను వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు.

ప్రతి ఇంటికీ పన్ను వేయండి



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: మున్సిపాలిటీలో ఇప్పటి వరకు పన్నులు లేని నివాసాలను గుర్తించి, వాటికి పన్నులు వేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్, సచివాలయ సిబ్బందికి సమీక్ష సమావేశం కమిషనర్ డానియేల్ జోసఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి సందర్శించి పన్నులు లేని గృహాలను గుర్తించాలన్నారు. పన్నులు చెల్లించకుంటే జరిగే నష్టాల గురించి గృహ యజమానులు అవగాహన కల్పించాలన్నారు. సరైన డాక్యుమెంట్స్ లేని నిర్మాణదారులకు కూడా పన్నులపై అవగాహన కల్పించి, మున్సిపల్ అధికారులతో మాట్లాడించాలన్నారు. పన్నుల విధానం అందరికీ ఆమోదయోగ్యంగా, పారదర్శకంగా ఉంటుందన్నారు. మేనేజర్ ప్రసాద్, ఆర్ఐ ప్రదీప్, ఏఈ కోటేశ్వరరావు, మాధవరావు, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

బూచేపల్లిని కలిసిన మణికంఠేశ్వరరెడ్డి



బూచేపల్లికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మణికంఠేశ్వరరెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని పార్టీ రాష్ట్ర ఐటీ వింగ్ గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం , నెల్లూరు జిల్లాల జోనల్ అధ్యక్షుడు పూసపాటి మణికంఠేశ్వరరెడ్డి శనివారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించారని, తన నియామకానికి సహకరించిన బూచేపల్లికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు శివకృష్ణ, రామకృష్ణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అచ్చయ్య భౌతికకాయానికి దద్దాల నివాళి



నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ, ఎంపీపీ, జెడ్పీటీసీ

కనిగిరిరూరల్: చాకిరాల ఎస్సీకాలనీకి చెందిన జెన్నిపోగు అచ్చయ్య మృతి చెందారు. అచ్చయ్య భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శనివారం సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకట రత్నం, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, నాగిరెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంద్రశేఖర్‌ను కలిసిన దద్దాల



దద్దాల నారాయణను సన్మానిస్తున్న యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, పార్టీ నేతలు

కనిగిరిరూరల్: యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను క్యాంపు కార్యాలయంలో పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. మొన్న జరిగిన త్రిపురాంతకం ఎంపీపీ ఎన్నికల్లో విజయం సాధించడంపై ఎమ్మెల్యే చంద్ర శేఖర్ కు దద్దాల నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దద్దాల నారాయణను యర్రగొండపాలెం పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు రాములు నాయక్, గంజరపల్లిరాజయ్య యాదవ్ తదితరులు ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు కటికల వెంకటరత్నం, జి.ఆదినారాయణరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, గొబ్బిళ్ల శ్రీను, మేలకల బాలు యాదవ్, పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ దిలీప్‌కుమార్

హనుమంతునిపాడు: రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించి అసైన్డ్ భూములు, రిజిస్ట్రేషన్ భూములు, ఫ్రీహోల్డు భూములు రైతు పార్మర్స్ విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. వ్యవసాయాధికారి గోపీకృష్ణ, వీఆర్‌ఓలు, వీపీఏలు పాల్గొన్నారు.

ఆర్థిక స్థితిగతులపై సర్వే చేయండి



మాట్లాడుతున్న డీపీఎం కృష్ణకుమార్



శిక్షణలో మాట్లాడుతున్న డీసీఎం కృష్ణకుమారి

జరుగుమల్లి(సింగరాయకొండ): డ్వాక్రా మహిళల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సర్వే చేయాలని డీసీఎం కృష్ణకుమారి అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో నర్సింగోలు క్లస్టర్ ఎన్యుమరేటర్స్‌కు శిక్షణలో ఆమె పాల్గొన్నారు. కృష్ణకుమారి మాట్లాడుతూ జీవనోపాధుల సర్వేకు ప్రభుత్వం యువతను నియమించిందని, వీరు ఇంటింటికీ సర్వే చేసి డ్వాక్రా మహిళల ఆర్థిక స్థితిగతులను ఏ విధంగా మెరుగుపరచాలో సర్వే చేస్తారని వివరించారు. ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్, ఏపీఎం డి.జయరాజ్, వీఓఏలు పాల్గొన్నారు.

మర్రిపూడి: మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధిపై ప్రణాళిక తయారు చేయాలని డీపీఎం కృష్ణకుమార్ అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో వార్షిక ప్రణాళిక సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘంలోని పదో తరగతి చదువుకున్న 5 మంది సంఘ సభ్యులకు శిక్షణ ఇవ్వడం, ఈ సభ్యులు 6 గ్రూపుల నుంచి 8 గ్రూపుల వరకు సర్వే చేయాలన్నారు. జమ, ఖర్చులు ఈ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. మరణించిన మహిళా సంఘ సభ్యులు తొలగించాలన్నారు. మండలంలోని 1020 గ్రూపు సభ్యులకు సమాచారం వారికి కావాల్సిన రుణప్రణాళిక తయారు చేయాలన్నారు. కొండపి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ కె.కళ్యాణి, ఏపీఎం ఎల్ కోటేశ్వరరావు, సీసీ రామయ్య, లక్ష్మమ్మ, రజినీ పాల్గొన్నారు.

భూముల విస్తీర్ణం సరి చూసుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌రెడ్డి

హనుమంతునిపాడు: రీసర్వే జరిగిన భూముల వివరాలు సచివాలయంలో ప్రకటన బోర్డులో ప్రకటించామని, నోటీస్ బోర్డులో రైతుల భూముల విస్తీర్ణం సరిచూసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కె.కిషోర్‌రెడ్డి అన్నారు. వీరరాంపురంలో శనివారం రైతులతో గ్రామసభ నిర్వహించారు. వీరరాంపురం రెవెన్యూలో విస్తీర్ణం మొత్తం 1436.44 ఎకరాలు, రైతులు 732 మంది ఉన్నారన్నారు. ఇందులో ప్రభుత్వ భూమి 203.30 ఎకరాలు, పట్టా భూమి 932.59 ఎకరాలు, దేవదాయ శాఖ భూమి 188.65 ఎకరాలు, అసైన్డ్ భూమి 111.89 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. రీసర్వే భూములు సర్వే నంబర్ల ప్రకారం పంచాయతీ కార్యాలయంలో ఉంచామన్నారు. రీసర్వే చేయక ముందు ఎంత విస్తీర్ణం ఉన్నది, రీసర్వే జరిగిన తరువాత ఎంత విస్తీర్ణం ఉన్నది రైతులకు నోటీసులు పంపిస్తామన్నారు. సర్వే నంబర్ల ప్రకారం విస్తీర్ణాలు సరిచూసుకోవాలని సూచించారు. మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, ఆర్ఐ కృష్ణచైతన్య, గ్రామ సర్వేయర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షిక వేడుకలు



మాట్లాడుతున్న ఎంఈఓ చెంచుపున్నయ్య

టంగుటూరు: మండలంలోని కందులూరు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ చెంచు పున్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సౌకర్యాలు ఉన్నాయని, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. అనంతరం ఆర్ దానయ్య పాఠశాలకు బీరువా బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రావణ్ కుమార్, ఉప్పలపాటి రామరాజు, డి. బసవయ్య, సర్పంచ్ ఈశ్వరమ్మ, మన్నం వెంకయ్య, క్లస్టర్ చైర్మన్ నరసరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ కె .రజిని తదితరులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు



దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: ప్రజలకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ విశ్వావసునామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమైయ్యే ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త ఆనందోత్సవాలు, వెలుగులు నింపాలని, అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఉగాది ముందస్తు వేడుకలు



కనిగిరి: ప్రత్యేక పూజల్లో విద్యార్థినులు



సాంప్రదాయ దుస్తులతో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

కనిగిరిరూరల్: తెలుగువారి తొలి పండుగ ఉగాది ముందస్తు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్‌లు, కరస్పాండెంట్లు ఉగాది పండుగ విశిష్ఠత గురించి విద్యార్థులకు వివరించారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమైయ్యే నూతన ఏడాది ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. స్థానిక వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు ఉగాది సంబరాలు ఎంతో ఉత్సాహంగా చేసుకున్నారు. విద్యార్థినులు ప్రత్యేక పూజలు చేశారు. కరస్పాండెంట్ రామన విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పామూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు ఉగాది పర్వదినాన్ని, రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఉగాగి పచ్చడిచేసి పంచిపెట్టి ఉగాది పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా రంజాన్‌గురించి తెలిపి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మూసీపై నేల చప్టా నిర్మించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కొండపి: ముప్పవరం, లక్ష్మక్కపాలెం మధ్యలో ఉన్న మూసిపై నేల చప్టా నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలియజేసి అనంతరం ఎంపీడీఓ రామాంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఒంగోలు నుంచి టంగుటూరు మీదుగా కొండపి రావడానికి సుమారు 40 కిలోమీటర్లు దూరం ఉంటుందని, చప్టా నిర్మిస్తే దూరం తగ్గుతుందన్నారు. పొందూరు నుంచి కొండపి చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాలకు ఈ రహదారి మార్గం చాలా సౌకర్యం ఉంటుందని తెలిపారు. సీపీఎం నాయకులు సుధాకర్, గడ్డం వందనం, ఏడుకొండలు, చిన్న బ్రహ్మయ్య, అంగలకుర్తి చిన్న బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలతో విజ్ఞానం పెంపు



ప్రతిభాపరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పామూరు: ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లోని అంతర్గత విజ్ఞానాన్ని వెలికితీస్తాయని సామాజిక కార్యకర్తలు జొన్నలగడ్డ గోవిందయ్య, కొట్టే రవీంద్రలు అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని శనివారం మాలల సంక్షేమసంఘం కన్వీనర్ కోట నీడి బాబు, కార్యదర్శి ఎ.సత్యనారాయణ, రాజశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు వచ్చే నెల 14న బహుమతులు అందజేస్తామన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎం రామస్వామి, కేజీబీవీ ప్రిన్సిపాల్ కటకం సజన, బీటీఏ నాయకులు టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నివేశన స్థలాలు, సాగుభూములు మంజూరు చేయాలి

పామూరు: అర్హులందరికీ 3 సెంట్లు నివేశనా స్థలం, సాగుభూములు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమ్మలపాటి మాల్యాద్రి, సీపీఎం మండల కార్యదర్శి ఖాదర్‌బాషా అన్నారు. ప్రజాచైతన్య యాత్రలు, ప్రజాసమస్యల పరిష్కారంలో భాగంగా శనివారం నివేశనాస్థలాలు, సాగుభూములు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్యకు అందజేశారు. కార్యక్రమంలో కాశే శంకర్, పలువురు సీపీయం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ రూల్స్‌లో సవరణ సరి కాదు

కనిగిరిరూరల్: పెన్షన్ విధానంలో అసంబద్ధమైన మార్పులను కేంద్ర ప్రభుత్వం చేయడం సరైంది కాదని యూటీఎఫ్ సీనియర్ నేత మీగడ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీపీఎస్ పెన్షన్ రూల్స్ 1972, 2021 ప్రకారం ఉద్యోగులకు ఎప్పుడూ పే రివిజన్ కమిషన్ వేసిన లాభాలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లు అందరికీ వర్తిస్తాయన్నారు. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం ఎప్పటి నుంచి పీఆర్‌సీ అమలు చేస్తుందని వెల్లడిస్తోందో.. అప్పటి నుంచే పదవి విరమణ ఉద్యోగులకు (పెన్షనర్లు) మాత్రం కొత్త పీఆర్‌సీ వర్తిస్తోందన్నారు. ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు (పెన్షనర్లు) కు పే రివిజన్ కమిషన్ వర్తించదని ఆందోళన వ్యక్తం చేశారు. అసంబద్ధమైన సవరణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సంఘ నాయకులు వి.మాలకొండారెడ్డి, కె.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి

కనిగిరిరూరల్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కోమ్మోజు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం జిల్లా కార్యదర్శి టీ రమణారెడ్డి అధ్యక్షతన ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కే శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 117ను రద్దు చేయాలన్నారు. పంచాయతీకి ఒక ఆదర్శపాఠశాల పేరితో వేరొక ప్రాథమిక పాఠశాలలోని మూడు, నాల్గు, ఐదు తరగతులను వీలినం చేయడం సరైంది కాదన్నారు. దీని వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ రవి, ఎస్‌కే ఖాజా రంతుల్లా, ఎం రాము తదితరులు పాల్గొన్నారు.